క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం కావడంతో ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పూజలు అనతంరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వీడని వాన



దొర్నిపాడు శివారులో కురుస్తున్న భారీ వర్షం

దొర్నిపాడు: మండలంలో వారం రోజులుగా భారీ వర్షాలు ముంచెత్తున్నాయి. దీంతో ఎక్కడ చూసినా వర్షపునీరు తాండవిస్తుంది. ప్రస్తుతం వర్షం వరి పంటలకు అనుకూలించినా మొక్కజొన్న, మినుము పంటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముందస్తుగా సాగుచేసిన ఖరీఫ్ పంటలపై వర్షం కనికరం చూపలేదని రైతులు వాపోతున్నారు. అలాగే కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో క్రిష్టిపాడు గ్రామ ప్రజలు అప్రమంతా ఉండాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి



ఐక్యత చాటుతున్న శ్రీకృష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): బలిజ ఉద్యోగులంతా ఏకతాటి ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాడాలని సోమేసుల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలోరాష్ట్ర శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ ఆదేశాల మేరకు సోమేసుల చంద్రశేఖర్ అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించా. ముఖ్య అతిథిగా సీనియర్ న్యాయవాది రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, ప్రముఖ వైద్యులు రామచంద్రరావు పాల్గొని శ్రీకృష్ణదేవరాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అడహక్ కమిటీ సభ్యులుగా చంద్రశేఖర్, నాగరాజు, విశ్వనాథ్, నరేష్, విజయ్, కిశోర్‌ను ఎన్నుకున్నారు.

బంగారు పడిగె వితరణ



బంగారు పడిగెను అందిస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మేశ్వర స్వామి వారికి దాతలు 10 గ్రాములు బంగారు పడిగెను బహుకరించినట్లు ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బనగానపల్లె పట్టణానికి చెందిన నవీన్‌కుమార్, గీత దంపతులు తమ ఇలవేల్పు స్వామి వారికి 10 గ్రాముల బంగారు పడిగెను బహుకరించారన్నారు. పడిగె విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. దాతల కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో శేషవస్త్రాలు అందించినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



జనార్దన స్వామి ఆలయం

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెలో జీర్ణోద్ధరణ గావించిన విష్వక్సేన, ఆంజనేయ, జనార్దనస్వామి ఆలయాల్లో ఈనెల 12 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న పురాతన ఆలయాలను పునర్నిర్మాణం చేపట్టామని, అందులో భాగంగా మొదటి రోజు 12న గోపూజ, గంగానయనము, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, 13న యంత్ర అభిషేకం, మూల మంత్రజప అనుష్టానములు, జన్దాన స్వామి ప్రీతిగా మహా నారాయణ హోమం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14న యంత్ర, విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ, ఆవాహిత దేవతా హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కల్యాణ వేడుక.. ఖరీదైన వేదిక!

- జోరుగా సాగుతున్న పెళ్లిళ్లు
- మధ్య తరగతి ప్రజలపై ధరాఘాతం

నంద్యాల(న్యూటౌన్): శ్రావణ మాసం.. శుభకార్యాలకు పెట్టింది పేరు. మంచి ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్ల సందడి మొదలైంది. ఇప్పటికే పలు జంటలు ఒక్కటయ్యాయి. మరిన్ని పెళ్లిళ్లు నిర్వహించేందుకు తల్లిదండ్రులు కల్యాణ మండపాలను బుక్ చేసుకున్నారు. కాగా.. పెరిగిన ఖర్చులతో మధ్య తరగతికి కల్యాణం తంతు భారంగా మారింది. ఈ నెలలో ఇప్పటి ఉన్న ముహూర్తాలతో పాటు రానున్న 10, 11, 13, 14, 15, 17, 18 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి, ముఖ్యంగా 13,14 తేదీల్లో అత్యధికంగా పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. పట్టణంలో వివాహాలకు సంబంధించి కొనుగోళ్లతో వస్త్ర, బంగారు దుకాణాల్లో రద్దీ పెరిగింది. ఇక డెకరేషన్, ఫొటోగ్రఫి, ఈవెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకులు, బోటిక్స్, బ్యూటీషియన్లు తీరిక లేకుండా ఉన్నారు..

పెరిగిన ఖర్చులు...

గతంలో వివాహ వేడుకలంటే బ్యాండ్ మేళాలు, భాజా భజంత్రీలు, పూల మండపాలు, ఫొటోలు, వీడియో షూటింగ్‌లు వంటివి ఉండేవి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. కొందరు వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు, ప్రీ వెడ్డింగ్ షూట్లకు ప్రకృతి సోయగాలతో పేరున్న ప్రాంతాలకు వెళ్తున్నారు. కాబోయే వధూవరులతో ప్రత్యేక పాటలు చిత్రిస్తున్నారు. కల్యాణ మండపంలో ఎల్‌ఈడీ స్క్రీన్లను ప్రదర్శించడం, డ్రోన్లతో షూటింగ్ వంటివి చేస్తున్నారు. దీంతో పలు విభాగాల ధరలు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. ముఖ్యంగా కల్యాణ మండపాలు, ఫొటో, వీడియో మేకింగ్, పూలదండలు, కేటరింగ్ తదితరాల నిర్వాహకులు ధరలను పెంచేశారు. దీంతో మధ్య తరగతి వర్గాల వారు పెరిగిన ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు.



వేడుకకు సిద్ధంగా ఉన్న కల్యాణ వేదిక

రూ.30 వేల నుంచి లక్షన్నర వరకు..

వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండడంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. మినీ ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాళ్లు పట్టణంలో మొత్తంగా 30కి పైగా ఉండగా, వీటితో పాటు ఆలయాల్లో ఉన్న హాల్స్ కూడా బుక్ అయిపోయాయి. ఫంక్షన్ హాళ్ల బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. మినీ ఫంక్షన్ హాల్ అయితే అద్దె రూ.30వేల నుంచి రూ.1.50లక్షల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా పూల డెకరేషన్, లైటింగ్, భోజనాల ఖర్చు వంటి వాటితో కలిపి ప్రస్తుతం మినీ ఫంక్షన్ హాల్ రూ.2.50 లక్షలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. పెద్ద కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాల్స్‌కుపెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఇక పెళ్లి మొత్తం ఫొటోలు, వీడియో చిత్రీకరణకు రూ.80వేల నుంచి రూ.2.5లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఎంత తక్కువలో వెళ్దామనుకున్నా.. రూ.50వేలకు తక్కువ కావడం లేదు. ఇక పూల దండలు రోజుకో ధర, పూలను బట్టి వసూలు చేస్తున్నారు. ఇక వాహనాల అద్దె, పందిరి వేయడం, ఇంటి వద్ద భోజనాలు, వస్త్రాలు, ఆభరణాలకు భారీగా వెచ్చించాల్సి వస్తోంది. దీంతో కల్యాణ వేడుక..ఖరీదైన వేదికగా మారిందని మధ్యతరగతి వర్గాలు వాపోతున్నాయి.

రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితిలో జిల్లా వాసులకు స్థానం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర నూతన కమిటీలో నంద్యాల జిల్లా వాసులు ఎన్నికైనట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం విజయవాడ ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ విద్యాసంస్థల డాక్టర్ రామకృష్ణారెడ్డి (నంద్యాల), కార్యవర్గ సభ్యులుగా బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి (బేతంచెర్ల)ని నియమించినట్లు తెలిపారు.

మహానందిలో సందడి

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శ్రావణమాసం, ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్థానిక కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారితో పాటు కోదండ రామాలయం, ఆంజనేయస్వామి, వినాయక నంది, గరుడ నంది ఆలయాలు సందర్శించారు. శ్రావణ మాసం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆర్జిత సేవా టికెట్లతో మృత్యుంజయ హోమం, చండీ హోమం, రుద్ర హోమం నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో హోమాలు జరిగాయి. కామేశ్వరి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన పట్టు చీరలకు విక్రయ వేలాలు నిర్వహించగా మహిళలు కొనుగోలు చేశారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడి వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, మల్లెల్ల పుల్లయ్య, రాష్ట్ర అడహక్ కమిటీ సభ్యులు సాంబశివుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబంధతను తొలగించి 72, 73, 74 జీవోలను అమలు చేయాలని కోరారు. 11వ వేతన సంఘం గడువు ముగిసి రెండు సంవత్సరాలైనా ఇప్పటి వరకు 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం మెమో నం.57 ద్వారా ఆదేశాలు జారీ చేసిందని, దేశంలో చాలా రాష్ట్రాలు ఈ ఉత్తర్వులను అమలు చేశాయని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపపోవడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ, సరెండర్ లీవ్ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. సభ్యులు గోపాల్‌రావు,జయరాం, మహబూబ్‌బాషా, రవి, మునిస్వామి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, రాంప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుల్లయ్య

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యాహక్కును హరించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రాజు, ఎంఆర్‌నాయక్, నాగర్జున, రాంబాబు, షాహీర్, రఫీ పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ప్రవేశించడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి, విద్యారంగంలో నెలకొన్న లోపాలపై పోరాటం నిర్వహిస్తున్నామన్నారు. అయినా ప్రశ్నించడాన్ని, సమస్యలను ఎత్తి చూపడాన్ని తట్టుకోలేక విద్యార్థి సంఘాలను నిషేధించడాన్ని చూస్తే.. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అనగదొక్కేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం దొరుకుతుందా అని ప్రశ్నించారు. తాము విద్యా సంస్థల్లోకి వెళ్లకపోతే ఇష్టారాజ్యంగా వ్యవహరించొచ్చనే ఇలాంటి చర్యలు పూనుకుందన్నారు. ఈ జీవోతో కూటమి ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పెంచి పోషించడమేనన్నారు. వెంటనే జీఓలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నవీన్, శీను, సురేష్ పాల్గొన్నారు.

చాగలమర్రిలో భారీ వర్షం

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రధాన రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. ఇక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వర్షపు నీరు భారీగా నిలిచి పోయింది. గ్రామంలోని పెద్దమకానం, ముత్యాలపాడు బస్టాండు, సెయింట్ ఆన్స్ పాఠశాల, గాంధీ సెంటర్ ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగి ప్రవహించడంతో సుమారు గంట పాటు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.



జలమయమైన తహసీల్దార్ కార్యాలయ ఆవరణ



ముత్యాలపాడు బస్టాండులో మురుగు కాలువలు నిండి రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



గాంధీ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాప్రతినిధులంటే లెక్కలేదా?

చాగలమర్రి: ప్రజాప్రతినిధులంటే అధికారులకు లెక్క లేదా?, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పనులు ఎందుకు చేయరని పెద్దబోధనం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ నరసింహుడు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎపీపీ వీరభద్రుడు అధ్యక్షత ఆదివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయితీ కార్యాలయంలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఓబులేసుకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం కదిరిపురం తండా గ్రామ సర్పంచ్ శ్రీలక్ష్మీబాయి మాట్లాడుతూ గ్రామంలో 559 సర్వే నంబరులో నాలుగెకరాల విస్తీర్ణంలోనున్న గ్రామ నత్తం భూమిలో అనుమతులు లేకుండా టీడీపీ నాయకులు స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారని, తహసీల్దార్ పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సభలో ప్రస్తావించారు. స్పందించిన తహసీల్దార్ విజయ్‌కుమార్.. విచారించి చర్యలు చేపడతామన్నారు. పెద్దబోధనంలోని తన పొలంలో 11 కేవీ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని వాటిని సరిచేయాలని గతంలో నిర్వహించిన మూడు సమావేశాల్లో అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా ప్రాణ నష్టం జరిగితే ఏఈ రమణయ్య బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంపీటీసీ నరసింహులు హెచ్చరించారు. మండలానికి ఉచితంగా మంజూరైన మినుము విత్తనాలను వ్యవసాయాధికారి రంగనేతాజి తెలుగు తమ్ముళ్లకు ఇళ్ల వద్దకెళ్లి పంపిణి చేశారని సర్పంచ్ రేనాటి బాలీశ్వరరెడ్డి ఆరోపించారు. ఈఓపీఆర్డీ తాహెర్‌హుసేన్ మాట్లాడుతూ మండలంలో స్వామిత్వ సర్వేకు గొడిగనూరు, గొట్లూరు, రాజోలి, నేలంపాడు, మద్దూరు, బ్రాహ్మణపల్లె, పెద్దబోధనం, రాంపల్లె, చింతలచెరువు, శెట్టివీడు, కలుగొట్లపల్లె ఎంపికయ్యాయని తెలిపారు. పశువైద్యాధికారి సాయిబాబా, ఎంఈఓ అనురాధ, వైస్ ఎంపీపీలు ముల్లా రఫీ, ఆశీర్వాదమ్మ, ఎంపీటీసీలు, ఏఈ కొండారెడ్డి, నవీన్, శివరామలింగారెడ్డి, సాయిబాబా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు



తమ్ముళ్ల అక్రమాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కేపీ తండా సర్పంచ్ శ్రీలక్ష్మీబాయి

భక్తిశ్రద్ధలతో జియారత్

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నె గ్రామంలోని పీర్ల చావిళ్లలో జియారత్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం ముగిసి 40 రోజులు కావడంతో జార్తలను పురస్కరించుకుని బార్ ఇమాం పీరును ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంతోపాటు కోవెలకుంట్ల, అమడాల, ముదిగేడు, వెలగటూరు, బిజనవేముల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చావిడి వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పోలీసుల అదుపులో కాపర్ వైర్ చోరీ ముఠా

కొలిమిగుండ్ల: కొద్ది రోజుల నుంచి రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో కాపర్ వైర్ చోరీకి పాల్పడుతున్న మీర్జాపురానికి చెందిన ముఠాను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి రైల్వే లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. హైటెన్షన్ వైర్లను కొద్ది రోజుల నుంచి అపహరిస్తూ సొమ్ము చేసుకునేవాళ్లు. ఈ వైర్ ఖరీదు అయినది కావడంతో ముఠా సభ్యులు తరచూ చోరీకి పాల్పడుతూ ఉన్నారు. ఎట్టకేలకు పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి 200 కేజీల వైర్‌తోపాటు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఎనిమిది మంది ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం 27 మంది రెండు గ్రూపులుగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు.

ఘనంగా శివపద సంకీర్తనోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ



శివపద కార్యక్రమంలో భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శ్రావణ మాసోత్సవాలలో భాగంగా శివపద సంకీర్తనోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రవచన కర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారు రచించిన 'శివపదం' సంకీర్తనలను ప్రముఖ నేపథ్య గాయకులైన నిహాల్, బృందం ఆలపించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరిపించాలనే భావనతో దేవస్థానం నిత్య కళారాధనగా ప్రతీరోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హరికథ, సంప్రదాయనత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని, గాత్రకచేరి లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంచి కళాకారులను దేవస్థానం ప్రోత్సహిస్తోందన్నారు. శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకుని శివపదం సంకీర్తన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ తదేకదీక్షతో రోజుకొకటి తక్కువ కాకుండా శివార్పణంగా శివకీర్తనలను రచించారన్నారు. ఈ కీర్తనలే 'శివపదం' పేరుతో ప్రసిద్ధి చెందాయన్నారు. నేపథ్యగాయకులు నిహాల్ బృందంలోని జె.వి.ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్, సర్వజ్ఞ, కార్తిక, శర్మిష్ఠ, తన్మిక్తి శృతి ఆయా సంకీర్తనలను ఆలపించారు. గణపతయే గణపతయే, శివ శివ మహాలింగ, పార్వతీశంకరులు, నమశ్శివాయ, ఆది ప్రదోషవేళ, పంచామృతాలతో, శివకామసుందరీ, నమో నమో ఉమాపతీ మొదలైన కీర్తనలను గాయనీ గాయకులు ఆలపించారు. కార్యక్రమానికి మృదంగ సహకారాన్ని టి.పి. బాలసుబ్రహ్మణ్యం, వయోలిన్ సహకారాన్ని కౌండిన్య అందించారు.

ఎస్సార్బీసీలో వ్యక్తి గల్లంతు

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో వ్యక్తి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. నాగపూర్ నుంచి వేలూరుకు కెమికల్ లోడ్‌తో లారీ బయలుదేరగా పాణ్యం సమీపంలో ఎస్సార్బీసీ కాల్వ వద్ద నిలిపి డ్రైవర్ స్నానం చేయడానికి కాల్వలో దిగాడరన్నారు. ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి గల్లంతైనట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కుళ్లిపోతున్న పొగాకు

- కొనుగోలుకు ముందుకు రాని కంపెనీలు
- కళ్లాల్లో కుళ్లిపోతున్న దిగుబడి
- అప్పులు భారమయ్యాయంటున్న రైతులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రుద్రవరం: పంట సాగుకు ముందు ఏజెంట్లు రైతులకు అరచేతిలో స్వర్గం చూపారు. దీంతో రైతులు రూ.లక్షలు వెచ్చించి పొగాకు పంట సాగు చేశారు. దిగుబడి చేతికి రాగానే ఆరబెట్టి విక్రయించేందుకు బేళ్లను సిద్ధం ఏశారు. తామే కొనుగోలు చేస్తామని చెప్పిన కంపెనీ ఏజెంట్ల జాడ లేకోవడంతో నేటికీ దిగుబడులు కళ్లాలు, ఇళ్లల్లో మగ్గిపోతోంది. దిగుబడి వచ్చి నెలలు గడుస్తున్నా కంపెనీలు కొనుగోలు చేయక, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అన్నదాతలు అప్పుల భారం మోయలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొగాకు కుళ్లిపోతోందని వాపోతున్నారు. పెట్టుబడులకు తెచ్చిన సొమ్ముకు వడ్డీలు చెల్లించకపోతున్నామని, ఇక అసలు ఎలా చెల్లించాలో అర్థంగాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

600 ఎకరాల్లో సాగు..

మండల కేంద్రంరుద్రవరంతో పాటు ఆర్.నాగులవరం, తిప్పారెడ్డిపల్లె, నర్సాపురం, ముకుందాపురం, ఆలమూరు, అప్పనపల్లె, డీ.కొట్టాల, శ్రీరంగాపురం తదితర గ్రామాల రైతులు దాదాపు 600 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశారు. వివిధ కంపెనీలకు చెందిన ఏజెంట్లు ముందస్తుగా నారు సిద్ధం చేశారు. అక్కడ నారు నిక్కగానే మండలాలు, గ్రామాల వారీగా ఉన్న ఆయా కంపెనీల ఏజెంట్లు రైతుల వద్దకు వెళ్లి పొగాకు పంట సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని, నారు తామే అందిస్తామని, క్వింటాకు దాదాపు రూ.15వేలకు పైగానే ధర లభిస్తుందని, దిగుబడులు రాగానే తామె కొనుగోలు చేస్తామని మాట ఇచ్చారు. వారి మాటలు నమ్మిన రైతులు సొంత పొలాలతో పాటు మరింత కౌలుకు తీసుకొని వారు ఇచ్చిన రకం పొగాకు పంట సాగు చేశారు. ఇందుకు ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టబడి పెట్టారు.

జాడలేని ఏజెంట్లు..

పంట కాలం పూర్తయ్యి.. దిగుబడులు వచ్చాయి. పొగాకును తోరణాలుగా అల్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిర్లలో ఆరబెట్టారు. ఎండగానే కంపెనీ జెంట్లకు సమాచారం అందించారు. ముందస్తుగా దిగుబడులు వచ్చిన రైతుల నుంచి చెప్పిట్లుగానే ఒప్పంద ధరకు కాస్త అటు ఇటుగా కొంత పొగాకు కొనుగోలు చేశారు. ఆ తరువాత ఏజెంట్ల జాడ లేదు. ఫోన్ చేసినా సమాధానం కరువైంది. నాటి నుంచి రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. నిత్యం పొగాకు ఆరబెట్టడం, సాయంత్రం కాగానే పట్టలు కప్పి ఉంచడం పరిపాటిగా మారింది. నెలలు గడుస్తున్నా పొగాకు విక్రయాలు సాగలేదు.



నాడు: డీ కొట్టాల వద్ద పందిరిలో భద్రంగా ఉన్న పొగాకు



నేడు: తిప్పారెడ్డిపల్లె వద్ద కళ్లంలో కుళ్లిపోతున్న పొగాకు

నాడు రూ.15వేలు..నేడు రూ.4వేల లోపే..

ఎట్టకేలకు ఇటీవల కంపెనీ ఏజెంట్లు అందుబాటులోకి వచ్చారు. దిగేబడిని కొనుగోలు చేయమని రైతులు వారిని ప్రాధేయపడ్డారు. అయితే పొగాకుకు డిమాండ్ తగ్గిందని, ధర పూర్తిగా పడి పోయిందని ప్రస్తుతం రూ.3వేల నుంచి రూ.4వేల లోపే ఉందని చెప్పారు. చేసేది లేక రైతులు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అయినప్పటికీ కొనుగోలు చేయడంలో జాప్యమవుతోంది. దీంతో ఆరు బయట కళ్లాల్లో ఉన్న పొగాకు బేళ్లు వానకు తడిసి కుళ్లిపోతోంది. కొన్ని గ్రామాల రైతులు చేసేదిలేక కుళ్లిన పొగాకు అలాగే వదిలేశారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంపై అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం తిప్పారెపల్లె ,నర్సాపురం,పెద్దకంబలూరు తదితర గ్రామాల్లో పొగాకు వర్షానికి తడిసి కుళ్లిపోతోంది.